## క్లుప్తంగా

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**మామిడికుదురు:** రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సమావేశం ఈ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్ బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, సంఘం ప్రతినిధులు పెయ్యల వీరభద్రరావు, బత్తుల రమేష్‌బాబు, చొప్పల గోపి, ఉండ్రు శ్రీరమణ, మంగం రామకృష్ణ పాల్గొన్నారు.

### నేత్రదానం



బెజవాడ కొండయ్య (ఫైల్)

**ఆత్రేయపురం:** మండలంలోని పేరవరానికి చెందిన బెజవాడ కొండయ్య (75) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం శ్రీరాధాకృష్ణ ఐ బ్యాంకునకు అందజేశారు. కొండయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### వైభవంగా ఆండాళ్ అమ్మవారి సేవ

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు, అర్చకులు ఆధ్వర్యంలో ఆండాళ్ అమ్మవారి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి గ్రామోత్సవం జరిగింది. వేద పండితులు వేదపఠనం, ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ద్రవిడ పారాయణ, పుణ్యాహవాచనం, తీర్థగోష్ఠి, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

### ఘనంగా భవానీల ఇరుముడులు

**అంబాజీపేట:** అమ్మవారి మాల ధరించి 41 రోజుల దీక్ష పూర్తి చేసిన భవానీలు శుక్రవారం ఇరుముడులు కట్టుకుని విజయవాడ బయలుదేరి వెళ్లారు. అంబాజీపేట పశువుల మార్కెట్‌లో ఉన్న విజయ కనకదుర్గమ్మ ఆలయంలో భవానీలకు ఇరుముడులు కట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో భవానీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీల శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం భవానీలు బస్సులో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

### వైభవంగా స్వామి వార్ల గ్రామోత్సవం

**మామిడికుదురు:** ధనుర్మాసం సందర్భంగా ఈదరాడలో ఉమా సోమేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహ స్వామి వార్ల గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ గ్రామోత్సవం ఆద్యంతం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో నెలరోజుల పాటు స్వామి వార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ప్రతి రోజు స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

**అంబాజీపేట:** విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తోందని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి చెప్పారు. తొండవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను అందించారు. అంబాజీపేట ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పేరాబత్తుల దొరబాబు, పితాని మంగాదేవి, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, వడ్డమాని సద్భావతి, హెచ్‌ఎంలు వి.కేశవాచార్యులు, పీఎంసీ చైర్మన్ బొంతు భాస్కరరావు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని పాలన

**మలికిపురం:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రామరాజులంక, శంకరగుప్తం, అడివిపాలెం గ్రామాల్లో సర్పంచులు కాకర శ్రీనివాసరావు, రాపాక ఆనంద్‌కుమార్, కొల్లు అనంతలక్ష్మి అధ్యక్షతన ఆయా పంచాయతీలు వద్ద వేర్వేరుగా జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు, ఆ పార్టీ మలికిపురం మండల అధ్యక్షులు కాపిశెట్టి కనకేశ్వరరావు, కొమరగిరి శ్రీనివాసరావు, రమేష్ రాజు, రామలింగ రాజు, ఆచంట సుబ్బారావు పాల్గొన్నారు.



సామాజిక సాధికార బస్సుయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు. చిత్రంలో మంత్రి విశ్వరూప్, ఎంపీ ఎం.వెంకటరమణారావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



మలికిపురం సభాస్థలికి పాదయాత్రగా తరలివస్తున్న మంత్రి వేణు తదితర నాయకులు



బస్సుయాత్రకు భారీగా తరలివస్తున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు

# సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- రూ.90 కోట్లతో రోడ్ల నిర్మాణం
- మలికిపురంలో కోలాహలంగా సామాజిక సాధికార బస్సుయాత్ర

**మలికిపురం:** రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తదితరులు అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా రూ.90 కోట్లతో రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద రావు తెలిపారు. మలికిపురంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు ఇంటి వద్ద ప్రెస్‌మీట్ తరువాత అక్కడి నుంచి నేరుగా మలికిపురంలో కనకదుర్గ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కె.సూర్యనారాయణరావుతో పాటు ఎమ్మెల్యే రాపాక పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన రహదారులైన చింతల మోరి–కరవాక రోడ్డుతో పాటు గుడిమెళ్లంక శివకోడు లాకులు, లక్కవరం–చింతలపల్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. పేదల కనీస అవసరాలు తెలిసిన ఏకైక నాయకుడు సీఎం జగన్ మాత్రమేనని ఆయన అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు అమలవుతాయని, ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తే వాటిని ఎత్తేస్తారని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన పథకాలన్నీ జగనే అమలు చేస్తుంటే ఇక ప్రతిపక్షాలకు ఇక పని ఏముందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌ను ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సామాజిక చైతన్యం తీసుకురావడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. సభలో మంత్రులతో పాటు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు వెంకట సుబ్బరాజు, పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, జిల్లా గ్రీవెన్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, కసిరెడ్డి అంజిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీ వీరా మల్లిబాబు, కుసుమ వనజకుమారి, వైస్ ఎంపీపీ రుద్రరాజు, చినరాజా, పాటి శివకుమార్, కంచర్ల శేఖర్, కుసుమ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అప్పనరామునిలంక నుంచి సాధికార యాత్రకు వెళుతున్న ప్రజాప్రతినిధులు, పార్టీ కేడర్, మహిళలు

**భారీగా హాజరైన జనం**

మలికిపురంలో జరిగిన సాధికార బస్సు యాత్రకు నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఉదయం 12 గంటలకు సభాస్థలికి చేరుకున్న జనం ఎండను సైతం లెక్క చేయక వేచియున్నారు.

**సాధికార బస్సుయాత్రకు తరలివెళ్లిన క్యాడర్**

**సఖినేటిపల్లి:** మలికిపురం కనకదుర్గ గుడి వద్ద శుక్రవారం నిర్వహించిన సాధికార బస్సుయాత్రకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ క్యాడర్ తరలివెళ్లారు. అలాగే ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రతినిధులు ఆటోలు, బైక్‌లకు పార్టీ జెండాలు కట్టుకుని రెట్టింపు ఉత్సాహంతో సభాస్థలికి చేరుకున్నారు.

**కదలివచ్చిన అభిమానులు**

**రాజోలు:** సామాజిక సాధికార బస్సు యాత్రకు నియోజకవర్గం నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు ఎంతో ఉత్సాహంగా కదలి వచ్చారు. శుక్రవారం మలికిపురంలో జరిగిన బస్సు యాత్రకు రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల నుంచి పార్టీ వందలాది మంది బైక్ ర్యాలీతో మలికిపురం సభాస్థలికి చేరుకున్నారు. బస్సు యాత్రకు స్వాగతం పలుకుతూ కపిలేశ్వరపురం మండలానికి చెందిన తప్పెటగుళ్లు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. జై జగన్ జైజై జగన్ అని అభిమానుల నినాదాలతో సభాస్థలి మార్మోగింది.

### ఆదుకోవాలని మోపిదేవికి వినతి



మోపిదేవికి తన భార్య ఆరోగ్య సమస్యను వివరిస్తున్న వీరాస్వామి

**రాజోలు:** ఏడు సంవత్సరాలుగా తన భార్య ఇల్లింగి లీలాకుమారి ఐటీబీ వ్యాధి (రక్తం, రక్త కణాలు తగ్గడంతో బాధపడుతుందని సోంపల్లి గ్రామానికి చెందిన వీరాస్వామి శుక్రవారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణను మలికిపురంలో కలసి వినతిపత్రాన్ని అందజేశాడు. నెలకు రెండు బ్లడ్ ప్యాకెట్లతో పాటు నాలుగు ప్యాకెట్లు రక్తకణాలు లీలాకుమారికి ఎక్కించవలసి వస్తుందని, సుమారు రూ.16 లక్షలు ఖర్చుచేసినా వ్యాధి నయం కాలేదని వాపోయాడు. తన భార్య చికిత్సకు నిమిత్తం ఆదుకోవాలని మోపిదేవి వద్ద కన్నీటి పర్యంతమయ్యాడు. లీలాకుమారి సమస్యను మోపిదేవి ఒక ట్రస్ట్ ప్రతినిధులకు వివరించి ఆమె చికిత్సకు సహకారం అందించాలని కోరారు. అలాగే ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అగ్నికుల క్షత్రియ నాయకుడు బొమ్మిడి వెంకటేష్, సోంపల్లి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



కలవచర్ల వార్డు సభ్యులకు కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధికి మెచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారు. దీంతో ప్రతిపక్షాలు ఎన్ని కూటములుగా ఏర్పడినా వైఎస్సార్ సీపీకి మాత్రం మండలంలో రోజు రోజుకూ మరింత విశేష ఆదరణ పెరుగుతుంది. మండలంలోని కలవచర్లకి చెందిన వార్డు సభ్యులు చలబోటి అర్జున్, వాడపల్లి వెంకట మహేశ్వరి, వాడపల్లి నగేష్ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు శుక్రవారం రావులపాలెంలోని గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన వారికి వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, కురుపూడి లోవ సత్యనారాయణ, పెందుర్తి నాగభూషణం పాల్గొన్నారు.

### నేడు పేరవరంలో గడప గడపకూ..

**ఆత్రేయపురం:** మండలంలోని పేరవరంలో శనివారం ఉదయం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు.

కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్ని శాఖల అధికారులతో పాల్గొని గడపగడపకూ సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

## సినీ గేయ రచయిత సూర్యకు సత్కారం



సినీ గేయ రచయిత సూర్యను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** జిల్లా చేతివృత్తుల సంఘం ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత, అమలాపురం రూరల్ మండలం సమనస గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి శ్రీనివాస సూర్యను స్థానిక కూచిమంచి అగ్రహారంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయమూర్తి సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శ్రీశ్రీకళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ హృదయంలో ఆనందం నిండినప్పుడు, హృదయాన్ని హత్తుకునే పాట పుట్టదు, గుండెకు గాయమైనప్పుడే నిజమైన పాట పుడుతుందని అన్నారు. గత ఏడాదిలో విడుదలైన రెండు చిత్రాల్లో సూర్య రాసిన పాటలకు శ్రోతల ఆదరణ లభించిందన్నారు. అనంతరం సినీ గేయ రచయిత సూర్యను ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు డీఎస్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సంయుక్త కార్యదర్శి కరీముల్లా బాబా తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి

**ఆలమూరు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ పెంటపాటి శ్యామల, ఎంపీటీసీ చుండ్రు సునీత, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లి రాజు ఆధ్వర్యంలో మండలంలోని మోదుకూరులో శుక్రవారం రాత్రి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గృహసారథులు తదితరులు గ్రామ వలంటీర్లు తదితరులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో కలసి గ్రామంలో పర్యటించారు. గత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలంతా గ్రామ సచివాలయంలో పల్లెనిద్ర చేసి ప్రజలతో మమేకమయ్యారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పెంటపాటి వెంకట్రావు, దంగేటి బాపనయ్య, ఎంపీడీఓ కె.జాన్ లింకన్, ఈఓపీఆర్‌డీ రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శి కె.మోక్షాంజలి తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి పింఛన్ కానుక పెంపు

**రావులపాలెం:** వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అణగారిన వర్గాల ప్రజలను ఆదుకోవడానికే దశల వారీగా పింఛన్ సొమ్ము రూ.మూడు వేలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ వద్ద ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్ము పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా మంజూరైన 185 పింఛన్ల మంజూరు కాగా ప్రస్తుతం ఆసంఖ్య మండలంలో 12,188కి చేరిందన్నారు. ప్రతి నెలా పింఛన్‌దారులకు రూ.3.59 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే మండలంలో మంజూరైన 26,495 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకూ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యసాయం పొందవచ్చని సూచించారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బి.ప్రసాద్, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, శెట్టిబలిజ రాష్ట్ర డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, కర్రి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అసమానతలు తొలగిపోవాలి

**మామిడికుదురు:** సమాజంలో ఆర్థిక అంతరాలను తగ్గించి, సామాజిక అసమానతలను తొలగించి రాజకీయ చైతన్యాన్ని కలిగించడమే లక్ష్యంగా ఐక్యతా విజయపథం యాత్ర నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మామిడికుదురు సెంటర్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెజార్టీ వర్గాలు కోల్పోయిన హక్కులు, ఆస్తులు, అవకాశాలు, ఆకాంక్షలు సాధించడం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దాని కోసం పేదరిక వేదిక నిర్మించుకుందామని విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి యువ నాయకత్వం ప్రాతినిథ్యం తీసుకుని, సంఘటిత శక్తిగా ఎదిగి సమష్టిగా పోరాడి సాధించుకుందామన్నారు. గత ఏడాది జూలై 23న తిరుపతి జిల్లా తడ నుంచి చేపట్టిన ఐక్యత విజయపథం పాదయాత్ర శుక్రవారం మండలంలోని ఈదరాడ గ్రామం చేరింది. అక్కడి నుంచి మగటపల్లి, ఆదుర్రు మీదుగా మామిడికుదురు చేరింది. మామిడికుదురులో బహిరంగ సభలో మాట్లాడారు. విజయ్‌కుమార్ సతీమణి విజయశ్రీ, సర్పంచ్ గొస్ మొహిద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, సైంటిస్ట్ నయినాల వేణుగోపాల్, సాపే రెడ్డి పాల్గొన్నారు.

### స్వామివారి సన్నిధిలో ఎంపీ 'మోపిదేవి'

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శుక్రవారం రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు. వెంట పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు కె.జాన్‌బాబు, ఓ.శ్రీనివాస్, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు పాల్గొన్నారు.

### రెండు గ్రామాల్లో వికసిత్ భారత్

**అయినవిల్లి:** మండలంలోని పొట్టిలంక, కొండుకుదురు గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచులు కోనే సుజాత సుబ్బలక్ష్మి, మేడిది దుర్గాప్రసాద్‌ల అధ్యక్షతన ఆయా గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ గన్నవరం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధుల కోసం వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, సంకల్ప యాత్ర కోఆర్డినేటర్ గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### విశ్వకర్మ యోజనను వినియోగించుకోవాలి

**ఆలమూరు:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని అన్ని కుల వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్ అన్నారు. ఆలమూరులో శుక్రవారం బీసీ సంఘాలకు చెందిన వివిధ కులవృత్తుల వారితో అవగాహన సదస్సు జరిగింది. కన్వీనర్ సత్తిబాబు గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో పార్లమెంట్ ఆమోదం పొందిన ఈ పథకం కుల చేతి వృత్తుల ఆర్థిక, జీవన ప్రమాణాలను పెంచుతుందన్నారు.

# ప్రజా సంక్షేమంతో జనరంజక పాలన

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



కొత్తపేటలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

**కొత్తపేట:** దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ఒకటో సచివాలయం పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా వివిధ పథకాలు పొందిన లబ్ధిదారులు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. ఆయా లబ్ధిదారులకు వర్తించిన పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సీఎం జగన్ పట్ల, తన పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు ఇచ్చి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధర రావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్ర రావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, చావలి సుబ్బరాయశాస్త్రి, సర్పంచ్ రెడ్డి చంటి, పంచాయతీ సభ్యురాలు బీమనాదం పావని, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల చంద్రావతి, సభ్యులు కొంబత్తుల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యమైన విద్యుత్తే లక్ష్యంగా సబ్‌స్టేషన్ల నిర్మాణం**

విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజ్ సమస్య లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా కొత్తగా సబ్‌స్టేషన్లు నిర్మించినట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా స్థానిక గోగివారిపేట ప్రాంత విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వారి తరఫున ఆ సమస్యను జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి సమస్య పరిష్కారానికి విద్యుత్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఇటీవల మిచాంగ్ తుపాను బీభత్సంతో తీవ్ర నష్టం వాటిల్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై, పోల్స్ పడిపోయి ఆ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, మహిళా విభాగం సభ్యులు కొంబత్తుల మంగమ్మ, బీర మేరి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైడే పాటించాలి



చింతలూరులో డ్రైడే సందర్భంగా పారిశుధ్య చర్యలు పరిశీలిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సువర్చలాదేవి, పి.భవానీశంకర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.